

నియోజకవర్గాల వారీగా టేబుళ్ల ఏర్పాటు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు 20 టేబుళ్ల చొప్పున ఏర్పాట్లను చేశారు. ఆర్మూర్, బోధన్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలకు 18 టేబుళ్లను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడు కేంద్రాలను సీఎంసీలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేశారు. వీటిలోనే మొత్తం ఈవీఎంలను లెక్కించనున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను తీసుకురావడంతో పాటు లెక్కించిన ఈవీఎంలను మళ్లీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే విధంగా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని కౌంటింగ్ కేంద్రం

గెలుపెవరిదో?

- నేడే నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్
- డిచ్‌పల్లి సీఎంసీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- మొత్తం 15 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు

నిజామాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనుంది. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో గల సీఎంసీలో జరిగే ఈ కౌంటింగ్‌కు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందిని ఉదయం 5గంటలకే రిపోర్టింగ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిబంధనల మేరకు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 8గంటలకే కౌంటింగ్‌ను ప్రారంభించనున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన మీదట ఈవీఎంలను రౌండ్ల వారీగా లెక్కించనున్నారు. మొత్తం 15 రౌండ్లలో కౌంటింగ్‌ను పూర్తి చేసే విధంగా టేబుళ్లను ఏర్పాటు చేశారు.

పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫలితాలను వేగంగా ఇవ్వడంతో పాటు వెను వెంటనే ఎన్నికల కమిషన్‌కు నివేదించే విధంగా పూర్తి ఏర్పాట్లు చేశారు. రౌండ్ల వారీగా అన్ని వివరాలను తీసుకుంటూనే మొత్తం రౌండ్లు పూర్తి చేసుకునే విధంగా ఏర్పాట్లను చేశారు. డిచ్‌పల్లి సీఎంసీలో జరిగే కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఆందోళనలు జరగకుండా ఉండేందుకు చుట్టూ ఐదు కిలోమీటర్ల విస్తీర్ణంలో 144 సెక్షన్‌ను విధించారు. కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బంది, ఏజెంట్లను మాత్రమే అనుమతించనున్నారు. పోటీ చేసిన అభ్యర్థులు, ప్రధాన ఏజెంట్ల మినహా ఎవరిని కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించకుండా చర్యలను చేపట్టారు. కేంద్ర బలగాలతో పాటు జిల్లా పోలీసులను బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు.

- మొదట మాక్ కౌంటింగ్ చేసిన తర్వాతే..

ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్‌ను నిర్వహిస్తారు. మొదట ఏజెంట్ల సమక్షంలో మాక్ కౌంటింగ్ చేసిన తర్వాత 8గంటలకు ఓట్ల లెక్కింపును మొదలు పెట్టనున్నారు. పూర్తిస్థాయిలో ఈ కౌంటింగ్ కోసం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని కూడా కేటాయించారు. ఈ కౌంటింగ్ కోసం మొత్తం 558 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరితో పాటు అదనంగా మరో 25శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచారు. వీరిలో 180 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 190 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 188 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు. వీరితో పాటు 70 మంది పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేకంగా నియమించారు. రౌండ్ల వారీగా లెక్కింపు చేపట్టడంతో పాటు ఏజెంట్ల సమక్షంలో వివరాలను ప్రకటించనున్నారు. పోటీచేసే అభ్యర్థుల మొత్తం ఏజెంట్లు ఉదయం 6 గంటలకే డిచ్‌పల్లిలోని సీఎంసీ వద్ద ఉండాలని ఆదేశాలు ఇచ్చారు.

తేలనున్న రాజకీయ పార్టీల భవితవ్యం

జగిత్యాల : పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నడిచినప్పటికీ రెండు జాతీయ పార్టీల మధ్య నువ్వా నేనా అనే స్థాయిలో పోటీ జరిగింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఆయా రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ స్టేషన్ ఇన్‌చార్జిలతో పాటు ఓటర్లు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఇంకా కొద్ది గంటలు మాత్రమే సమయం మిగిలి ఉంది. ఆసక్తి కలిగిన సంబంధిత వర్గాల వారంతా పోలింగ్ పూర్తయిన నాటి నుంచి రోజుల వారిగా లెక్కపెట్టుకుంటూ వస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల భద్రత

2019లో ఓట్లు ఇలా...

నిజామబాద్ పార్లమెంట్ స్థానంలో 2019లో జరిగిన ఎన్నికల్లో పసుపు బోర్డు అంశంతో బీజేపీ నుంచి ఎన్నికల బరిలోకి దిగిన ధర్మపురి అర్వింద్ అప్పటి సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవితపై ఘన విజయం సాధించారు. అర్వింద్‌కు 4,80,584 (45.22) శాతం ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవితకు 4,09,709 (38.55) శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కి గౌడ్‌కు 69,240 (6.52 శాతం) ఓట్లు వచ్చాయి.

2024 ఎన్నికల్లో పోలింగ్ నమోదైంది ఇలా..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 17,04,867 మంది ఉండగా, 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలో 71.92 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో జగిత్యాల లో 73.87 శాతం, కోరుట్లలో 73.75 శాతం, నిజామాబాద్ జిల్లా బాల్కొండలో 74.75 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 74.54 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 61.83 శాతం, బోధన్‌లో 74.56 శాతం, ఆర్మూర్ లో 73.14 శాతం పోలింగ్ నమోదైంది.

మారిన రాజకీయం...

తాజా ఎన్నికల్లో సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. గత శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకుంది. శాసన సభ ఎన్నికల తరువాత అయిదు నెలల తేడాతో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నడిచినప్పటికీ రెండు జాతీయ పార్టీ మధ్యే నువ్వా నేనా అనే స్థాయిలో పోరు జరిగింది. జాతీయ స్థాయి ఎన్ని కలు కావడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ గట్టిగానే తలపడ్డాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఓట్లు ఎటువైపు క్రాస్ అయ్యాయనే విషయమై నాయకులు, కార్యకర్తలు సెగ్మెంట్ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలు

ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంచుతున్నామని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. ప్రజలు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన మున్నూరు కాపు సంఘ నేతలు



ఎంపీ బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘ నాయకులు

జగిత్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లను సోమవారం జిల్లాకు చెందిన పలువురు మున్నూరు కాపు సంఘం నేతలు కలిశారు. కరీంనగర్‌లో వేర్వేరు సందర్భాల్లో ఎంపీ బండి సంజయ్‌ను కలిసి శాలువతో సన్మానించారు. అదేవిధంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలవగా పలువురు మున్నూరు కాపు సంఘం నేతలను శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు రాచకొండ ఒడ్నాల రాజశేఖర్, చిట్ల రమణ, శ్రీరాములు, లైశెట్టి వెంకన్న, విజయ్, అనిల్, నరేశ్, రమేశ్, మహేశ్, హరిశంకర్, వెంకన్న, శ్రీనివాస్, గంగారెడ్డి, కృష్ణానందా రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్నా కిసాన్‌మోర్చ నాయకులు

జగిత్యాల అర్బన్, జూన్ 3: రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కుంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం చొరవచూపాలని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాంబాబును కలిసి రైతాంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. పచ్చిరోట్ట విత్తనాలను రైతుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఈ వానాకాల సీజన్ నుంచే అమలు చేసి, రైతాంగాన్ని ఆదుకో వాలని, రైతులకు మాఫీ చేస్తామన్న రెండులక్షల రుణమాఫీని అమలు చేసి, నూతన రుణాలను రైతులకు అందించాలని కోరారు. రైతు నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గత సీజన్‌లలో రైతుల దగ్గర సేకరించిన ధాన్యంలో అనేక అవకతవకలు జరిగాయని, తరుగు పేర తీసిన ధాన్యానికి డబ్బులు చెల్లించేలా చూడాలన్నారు. అట్లాగే రైతులు పండించిన ప్రతి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ నాయకులు సురకంటి నారాయణరెడ్డి, ముద్దం రాము, నరేడ్ల రవి, ఏలేటి రాజు, గంగారెడ్డి, రాజేష్ తదితరులున్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ

కథలాపూర్, జూన్ 3 : మండల కేంద్రంలోని రైతు డిపో, కనకదుర్గ, శ్రీసాయి విత్తన, పురుగు మందుల దుకాణాలను సోమవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన రసాయనిక పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీలర్లకు వివరించారు. రికార్డులను తనిఖీ చేసి రైతులకు విక్రయించిన ప్రతీ దానికి తప్పనిసరిగా రసీదు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఓ యోగిత, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.

కాపు రైతు సేవా సంఘం కార్యవర్గం

రాయికల్, జూన్ 3: మండలంలోని కిష్టంపేట గ్రామంలో కాపు రైతు సేవా సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కచ్చకాయల గంగన్న, ఉపాధ్యక్షులుగా జవ్వాజి మల్లయ్య, క్యాషియర్‌గా తంగెళ్ల రమేష్, రైటర్‌గా నల్లాల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా కచ్చకాయల రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాత కార్యవర్గ సభ్యులకు వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు.

CHANGE OF NAME

I, **SHEK TAAZ** S/O. **SHEK DASTAGIRI**, aged 32 years, Occupation: Driver, R/o. House No.7-82, Tharakaramanagar, Jagtial Mandal, Jagtial District - 505455, T.S. shall henceforth be known as **SHAIK TAJ S/O. SHAIK DASTAGIR.**

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

జగిత్యాల అర్బన్, జూన్ 3: జిల్లాలో గత మార్చిలో నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలలో హాజరుకాని విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించిన వారికి ఈనెల 4 వ తేదీ(నేటి నుంచి) మంగళవారం నుంచి పరీక్షలు జరుగుతాయని ఇంటర్మీడియేట్ పరీక్షల కన్వీనర్ నారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా కేంద్రంలో జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 1:30 గంటలకు హాజరుకావాలన్నారు.

పట్టణ పరిశుభ్రతను మరింత మెరుగుపరుద్దాం



పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిశుభ్రతను మరింత మెరుగుపరుద్దామని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండు ప్రాంతం నుంచి పలు వీధుల్లో ఉన్న రోడ్డుపై మురుగునీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ ట్రాక్టర్‌లో వేయాలని ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దాసరి లావణ్య, నక్క జీవన్, పాల్గొన్నారు.

పనిచేయని హైమాస్ట్ లైట్లు

పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, జూన్ 3 : మండల కేంద్రంలోని అంగడి బజారులో గతంలో ఏర్పాటు చేసిన మూడు లైట్లలో రెండు హైమాస్ట్ లైట్లు సుమారు మూడు నెలలుగా పని చేయటం లేదని అంగడి బజారు ప్రజలు తెలిపారు. పోలీస్ స్టేషన్ వైపు ఉన్న లైట్ మాత్రమే పని చేస్తూ వెలుతురు ఇస్తుందని పలువురు తెలిపారు. కొడిమ్యాల గ్రామ అంగడి బజారులో గాంధీ విగ్రహం వద్ద ఉన్న మూడు హైమాస్ట్ లైట్లలో సూరంపేట వైపు, బస్టాండ్ వైపు ఉన్న లైట్లు పని చేయటం లేదని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించిన ఎవ్వరు పట్టించుకోవటం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గురువారం నిర్వహించు వార సంత రాత్రి వరకు కొనసాగుతుంది. సంతకు కొడిమ్యాల గ్రామస్తులే కాకుండ మండలంలోని, ఇతర మండలాలకు చెందిన వివిధ ప్రాంతాల నుండి వచ్చే వారు లైట్లు పనిచేయక పోవటంతో చీకటిగా ఉండటంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు పట్టించుకొని హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తేవాలని గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



జెండావిష్కరిస్తున్న కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

జగిత్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గీతాలాపాలన, వందన సమర్పణ చేశారు. అనంతరం మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ఓట్లు వేసి ప్రజలు మోసపోయారన్నారు. ఒక్క హామీ సైతం నెరవేర్చకుండా గ్రూప్ రాజకీయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంద న్నారు. త్వరలోనే జిల్లా నుంచి మండల, గ్రామ స్థాయి బీఆర్ఎస్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా నడిపించిందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి కేసీఆర్ విశేష కృషి చేశారన్నారు. దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రబాగాన తెలంగాణను నిలిపిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ మాట్లాడుతూ తెలంగాణ మలి ఉద్యమాన్ని చేపట్టి గమ్యాన్ని చేరుకున్న నేత కేసీఆర్ అని పొగిడారు. 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు కోసం కొట్లాడి గెలిచిన గొప్ప నాయకులు కేసీఆర్ అని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, వివిధ హోదాల్లో గల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఇతరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవు : ఎస్సై

మెట్‌పల్లి, జూన్, 3 : డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడితే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ మొహమ్మద్ శాకీర్‌సిద్ధిఖ్‌పై అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాడని గటిపల్లి రాజశేఖర్‌పై ఫిర్యాద్ చేయగా సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్క పేట గ్రామానికి చెందిన ఆవుల శ్రీకాంత్ అను వ్యక్తి సెల్ వారం రోజుల క్రితం పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో పొగోట్టుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్‌ను దొరుకబట్టి అతనికి అందజేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వివేక్ పరామర్శ

పెగడపల్లి, జూన్ 3 : మండలంలోని అయిత్‌పల్లి గ్రామానికి చెందిన పాకాల రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం సాయంత్రం చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకట స్వామి, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన దయాల రాయనర్సు కుటుంబాన్ని పరామర్శించి వారి కుటంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయమందించారు. ఈ సందర్భంగా వారి వెంట పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, అనీల్ గౌడ్ , సతీష్ రెడ్డి, రాజు, రాంరెడ్డి ఉన్నారు.

సమర్థవంతమైన విధుల ద్వారానే మంచి ఫలితాలు

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఇన్సిడెంట్ ఫ్రీగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో జిల్లా పోలీసుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. జిల్లాలో ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికల నిర్వహణకు కృషిచేసిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని గుర్తించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి పోలింగ్ ముగిసే వరకు క్రమశిక్షణతో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించడం వల్లే ఎన్నికల విజయవంతం చేశామన్నారు. అవసరమైన ప్రదేశాల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు చేయడం ద్వారా అన్ని రకాల అక్రమ తరలింపులు అడ్డుకున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వినోద్ కుమార్, భీమ్‌రావు, డీఎస్పీలు రవీంద్ర కుమార్, రగు చందర్, ఉమామహేశ్వర్ రావు, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, లక్ష్మీ నారాయణ, రఫీఖ్ ఖాన్, సీఐలు వేణుగోపాల్, రామ్ నరసింహరెడ్డి, రవి, సురేశ్, నవీన్, ఆర్ ఐలు జానీమియా, రామకృష్ణ, వేణు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

పాస్‌పోర్ట్ పోయినది

★ పులకం గంగన్న తండ్రి : మల్లయ్య, గ్రా: చెర్లపల్లి, పో: ర్యాలపల్లి, మం: గంగాధర, జిల్లా : కరీంనగర్ అను నా యొక్క పాస్‌పోర్ట్ నెం. Z068500 గలది మా ఇంటి వద్ద నుండి గంగాధర మండల కేంద్రానికి పోవు దారిలో నా బ్యాగు పోయినది. అందులో నా పాస్‌పోర్ట్, మెమో ఇతర డాక్యుమెంట్స్ పోయినవి. దొరికినవారు పై అడ్రస్‌లో ఇచ్చిన తగిన పారితోషికం ఇవ్వబడును. సెల్ : 90007 94141

AJK-185939

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా సమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 99854 10640

జగిత్యాల :- సెల్: 99854 11262

మెట్‌పల్లి :- సెల్: 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

రెస్టారెంట్ల తనిఖీ

కోల్‌సిటీ, జూన్ 3: రామగుండం కార్పొరేషన్‌లో సోమవారం పలు రెస్టారెంట్లలో ప్రజాఆరోగ్య విభాగం అధికారులు తనిఖీ నిర్వహించారు. రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన గడువు తేదీ దాటిన పదార్థాలను గుర్తించారు. గడువు దాటిన, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని తయారు చేస్తున్న రెస్టారెంట్లను గుర్తించి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాం, నాగభూషణం, సునీల్, కిరణ్, వైకుంఠం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఆర్టీసీ డిపో అధికారులకు ఏఐటీయూసీ వినతి

కోల్‌సిటీటౌన్, జూన్ 3: గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్ ఎంఎస్ రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏగౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖ ని ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ను సూపర్‌వైజర్ రమేష్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రమేష్‌ను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులకు ఇచ్చే వేతనం నుంచి కాంట్రాక్టర్ ఎంఎస్‌రెడ్డి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నా రు. గత నాలుగేళ్లుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకర మన్నారు. ఈవిషయమై కొన్ని నెలల క్రితం డిపో మేనేజర్, కాంట్రాక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు శివ, రాజు, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.



డిపో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వడదెబ్బతో ఒకరి మృతి

గంగాధర, జూన్ 3: గంగాధర మండలం తాడిజెర్రిలో వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుంటు కు మల్లయ్య(68) కుటుంబం రేకుల ఇంట్లో నివసిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఎండ తీవ్రతకు తీవ్ర అనారోగ్యానికి గురైన మల్లయ్యను కుటుంబీకులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన మల్లయ్య దహన సంస్కారాల కు గ్రామస్థులు విరాళం అందించి కార్యక్రమం నిర్వహించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

రామడుగు, జూన్ 3 : మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన కొత్త భూమయ్యకు చెందిన ఆవు పిడుగుపాటుతో ఆదివారం మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల పాడి ఆవు మృతి చెందడంతో రైతు రోధిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


















ముగ్గురిపై కత్తితో దాడి

● ఒకరి పరిస్థితి విషమం.. ఇద్దరికి గాయాలు

కోరుట్ల, జూన్ 3: టాయిలెట్ రూం శుభ్రపరిచే విషయంలో చోటు చేసుకున్న గొడవలో ముగ్గురిపై కత్తితో పొడిచి గాయపరిచిన సంఘటన కోరుట్ల పట్టణంలోని హాజీపుర కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు... బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీలోని ఓ ఇంట్లో హజర్ పాషా, షేక్‌షఫీ అనే వ్యక్తులు వారి కుటుంబ సభ్యులతో కిరాయి ఇంట్లో వేరువేరుగా నివాసం ఉంటున్నారు. హజార్ పాషా తన భార్యతో నివాసం ఉంటూ పట్టణంలో పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేస్తుంటాడు. షేక్‌షఫీ ఇద్దరు పిల్లలు భార్య, మామతో నివాసం ఉంటూ పట్టణంలో చిరు వ్యాపారం చేస్తుంటాడు. వీరి ఇద్దరి కుటుంబాల మధ్య తరచుగా గొడవ జరుగుతోంది. సోమవారం హజర్ పాషా, షేక్‌షఫీ మధ్య గొడవ జరిగి ఉద్రిక్తతతకు దారితీసింది. గమనించిన షేక్‌షఫీ మామ సయ్యద్ మొహినోద్దీన్, ఆయన కూతురు సనా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే కోపోద్రిక్తుడైన హజర్‌పాషా పక్కనే తోపుడు బండిపైన ఉన్న కత్తితో దాడి చేయడంతో దాడిలో మొహినోద్దీన్‌తో పాటు సనా గాయపడ్డారు. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న గోదావరి గమనించి వారిని వారించే ప్రయత్నం చేయగా అమెపై కూడా హజర్ దాడి చేసాడు. సంఘటనలో మహినోద్దీన్ మెడ ప్రాతంలో తీవ్ర గాయంకాగా సనా, గోదావరి స్వల్పగాయాల పాలయ్యారు. మోహినోద్దిన్ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. షేక్‌షఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

విజయవంతమైన 2వ వారం
Its A Pure
LOVE STORY



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00
SREE SREENIVASA SCREENS RELEASE

కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడి హత్య

● పాడె మోసిన ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మారం, జూన్ 3: ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు రేండ్ల నరేష్(40) హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి కటికెనపల్లి గ్రామంలో నరేష్ నూతన గృహ నిర్మాణ పనులు చేసుకుంటున్నాడు. అదే క్రమంలో ఆరుగురు వ్యక్తులు కలసి మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడి చేశారు. వీరి దాడిలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం కటికెనపల్లిలో జరిగిన నరేష్ అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని పాడె మోశారు. నరేష్ అంతిమయాత్రకు గ్రామస్థులు తరలివచ్చారు. గ్రామంలో జరిగిన పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని పథకం ప్రకారమే నరేష్‌ను హత్య చేశారని పెద్దపల్లి సీఐ కృష్ణ తెలిపారు. హత్య కేసులో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తురిస్తున్నట్టు ఆయన తెలిపారు.

● పోలీసుల తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం



రేండ్ల నరేష్(ఫైల్)

పెద్దపల్లి పోలీస్‌ల పనితీరుపై త్వరలో సీఎంకు ఫిర్యాదు చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి అక్ష్మణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడు నరేష్ హత్య ఘటన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి పోలీసుల నిర్లక్ష్యం కారణంగా నరేష్ మృతి చెందాడని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఇక్కడి పోలీస్ యంత్రాంగం విఫలమైందని ఆయన ఆరోపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పెద్దపల్లి సీఐ, ఎస్సైలపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా విన్నవించనున్నట్టు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



వేంపేటలో గంగామాత ఆలయంలో కల్యాణం



భీంరాజ్‌పల్లెలో సీతారాముల కల్యాణ మహోత్సవం

మెట్‌పల్లి రూరల్, జూన్ 3: మండలంలోని వేంపేట గ్రామంలో గంగామాత ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని గంగపుత్ర కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు కన్నుల పండువగా జరిపారు. సోమవారం గ్రామంలోని గంగామాత ఆలయంలోని అమ్మవారికి పురోహితులు ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికుల ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ కల్లెడ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గంగపుత్ర కమిటీ నాయకులు గంగారం, గంగన ర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

● గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లె గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండువలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొమ్మెన మాధవి -కుమార్, ధర్మకర్త చింతపంటి శశికళ-తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారులు గోవర్ధన నరసయ్య, సాయికృష్ణ ఆచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో స్థలం విక్రయించి మోసం

● నలుగురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 3: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే స్థలాన్ని పలువురికి విక్రయించి కొనుగోలుదారును మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో నలుగురిపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశాలపేట గ్రామానికి చెందిన (ప్రస్తుతం మహారాష్ట్రలోని పూణేలో నివాసం) గంగిరెడ్డి భీంరెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబర్ 277లో 167 గజాల ఇంటిస్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈ స్థలాన్ని గోపడి వీరరావు నుంచి పద్మలత, ఆమె వద్ద నుంచి మూల కిషన్‌రెడ్డి కొనుగోలు చేయగా అతడి నుంచి బాధితుడైన గంగిరెడ్డి భీంరెడ్డి కొనుగోలు చేశాడు. ఇదిలా ఉండగా బాధితుడి స్నేహితుడైన లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సునిల్‌లు కలిసి గంగిరెడ్డి భీంరెడ్డి ఏళ్ల తరబడిగా పూణేలో నివాసముంటున్నాడని గ్రహించి ఆ స్థలాన్ని కాజేయాలని కుట్ర పన్నారు. గోపడి వీరరావు కొడుకైన గోపడి మాధవరావుతో లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి కుమ్మక్కై, కిరణ్‌రెడ్డి తల్లి అయిన లక్కిరెడ్డి సుకన్య పేరిట డబుల్ రిజిస్ట్రేషన్ చేయించడమే గాక ఆ స్థలం పక్కనే ఉన్న 146 గజాల ఖాళీ స్థలాన్ని కూడా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, సాక్ష్యంగా సునీల్ వున్నాడు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. ఆ స్థలం తనదని బాధితుడు వెళ్లి నిర్మాణాన్ని అడ్డుకోబోగా వారించి, మళ్లీ వస్తే చంపుతానని బెదిరింపులకు గురిచేశారు. ఈ మేరకు బాధితుడు గంగిరెడ్డి భీంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులు గోపడి మాధవరావు, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, లక్కిరెడ్డి సుకన్య, సునీల్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు లక్కిరెడ్డి గోపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి ఆదేశాలతో నిందితుడిని జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాద బాధ్యులను శిక్షించాలి

గంభీరావుపేట, జూన్ 3 : గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లి ఎల్లయ్య (60) అనే వ్యక్తి మృతిచెందగా ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. గోరంటాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య అనే వ్యవసాయ కూలీ ఆదివారం సైకిల్‌పై మూలపల్లె వెళ్లి తిరిగి వస్తున్నాడు. కామారెడ్డి వైపు నుంచి గజసింగవరం వైపు వెళ్తున్న కారు ఎల్లయ్యను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కొద్ది సేపటికే మృతి చెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఎల్లయ్య మృతి చెందాడని మృతుడి బంధువులు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎల్లయ్య మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, మృతుడికి కుటుంబానికి పరిహారం చెల్లించాలని రాస్తారోకో చేశారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీస్‌లు అక్కడికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఎల్లయ్య మరణించాడని, వెంటనే కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని, మృతుడు ఎల్లయ్య కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహం తీసుకువచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని భీష్మించడంతో సీఐ శ్రీనివాస్‌గౌడ్ సముదాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.



గోరంటాలలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

టీకా వికటించి చిన్నారి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: టీకా వికటించి తమ చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బుర్క ఇషిత - రాకేశ్ దంపతులకు కూతురు అన్విశ్రీ(4 నెలలు) ఉంది. గత నెల 29న చిన్నారి అన్విశ్రీకి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో టీకా వేయించారు. అప్పటి నుంచి చిన్నారి తీవ్ర జ్వరం, విరేచనాలతో అస్వస్థతకు గురైంది. దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మందులను అందించి పంపించారు. సోమవారం పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది. టీకా వికటించడంతోనే తమ చిన్నారి చనిపోయిందని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. విచారణ జరిపి ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వైద్యురాలు స్రవంతిని సంప్రదించగా టీకా వికటించి చిన్నారి మృతి చెందిందనే తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇషిత ఏడో నెల గర్భిణిగా ఉన్న సమయంలో కడుపులోని బిడ్డ గుండెకు రంధ్రం ఉందని గుర్తించి వారికి వివరించామన్నారు. గత నెల 29న చిన్నారికి పెంటా వ్యాక్సిన్ వేశామని తెలిపారు. చిన్నారి మృతికి టీకా కారణం కాదని తెలిపారు.

ఎల్ఎల్‌బి నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 3: ఎస్‌యూ పరిధిలోని ఎల్.ఎల్.బీ నాలుగు, ఆరో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాద రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 11వ తేదీ తుది గడువు అని,300/- అపరాద రుసుంతో 14వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 3 : ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్.ఎం నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాద రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 11వ తేదీ తుది గడువు అని,300/ల అపరాద రుసుంతో 14వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు సరికాదు

● మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హన్మంతరావు

మల్యాల, జూన్ 3: దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని, అభివృద్ధి చేసి ప్రజల నుంచి ఓట్లు అడగాలే తప్ప దేవుని పేరు చెప్పి ఓట్లు తీసుకునే ఆచారం పక్కన పెట్టాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. కొండగట్టు అంజనేయస్వామిని సోమవారం దర్శించుకున్నారు. స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి చేయకుండా అయోధ్య పేరు చెప్పి ఓట్లు అడిగిన బీజేపీకి అబద్దాలు చెప్పి ఓట్లు అడిగిన కేసీఆర్ గతే పడుతుందని విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టుకు 500కోట్లు అని ప్రకటించి ఇవ్వకపోవడంతోనే బీఆర్ఎస్‌ను కొండగట్టు అంజన్న అధికారంలోకి రాకుండా చేశారని, ప్రజలతో పాటు దేవుళ్లతోనూ అబద్దాలు ఆడడం కేసీఆర్‌కు అలవాటేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండగట్టు దేవస్థానం అభివృద్ధి కోసం ఈ ప్రాంతం వాసులు అనేక ఆశలు పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి ఇక్కడ సౌకర్యాలు, సదుపాయాల కోసం విన్నవించి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమి విజయం సాధించాలని ఆంజనేయస్వామిని కోరుకున్నట్లు వీహెచ్ తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి అట్టడుగు వర్గాల ప్రజలకు, జనాభా ప్రతిపాదికన అందాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తారని చెప్పారు. బడుగు బలహీన వర్గాల కోసం రాహుల్‌గాంధీ పోరాడుతుండగా మరో నాయకుడు దేవుళ్ల పేరిట ఓట్లు అడిగి కేవలం ధనవంతులకే లాభం చేస్తున్నారని పరోక్షంగా ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ఆయన వెంట దొంగ ఆనందరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, నేరెళ్ల సతీస్‌రెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సంతప్రకాష్‌రెడ్డి, గాజుల అజయ్, నల్లపు మల్లేశం తదితరులు ఉన్నారు.



కొండగట్టులో అంజన్న దర్శనం చేసుకుని వస్తున్న వీహెచ్

సీఎంను కలిసిన సివిల్స్ ర్యాంకర్



సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రామడుగు, జూన్ 3: కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించాడు. కాగా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని తల్లి లక్ష్మీతో హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం సాయికిరణ్‌ను శాలువాతో సన్మానించారు. పేదరికంతో ఉన్నత చదువులు చదివించిన తల్లి లక్ష్మిని సీఎం అభినందించారు. పోస్టింగ్ తీసుకున్న తర్వాత తనను మరోసారి కలవాలని సాయికిరణ్‌ను సీఎం కోరారు. మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు తదితరులు ఉన్నారు.

హనుమాన్ జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

మల్యాల, జూన్ 3: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గత నెల 30నుంచి ఈ నెల 1వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి రూ.1,51,38,490ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.31,09,700, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.9,76,150, ప్రత్యేక దర్శనం రూ. 21,77,500, ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ.76,42,000ల లడ్డూ విక్రయాలు, రూ. 12,33,140ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1.30,43,525 సమకూరగా ఈ సారి రూ.20,64,965 అధికంగా వచ్చినట్లు అయింది.

భర్త మాట్లాడడం లేదని భార్య ఆత్మహత్య



మమత (ఫైల్)

గన్నేరువరం, జూన్ 3: భర్త తనతో సరిగా మాట్లాడడం లేదని తీవ్ర మనస్థాపం చెందిన భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గన్నేరువరం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పత్తి మమత(27) దుర్గాప్రసాద్‌లకు 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 సంవత్సరాల కొడుకు ఉన్నాడు. రెండు నెలల క్రితం భర్త దుర్గాప్రసాద్ ఉపాధి కోసం జార్ఖండ్‌కు వెళ్లాడు. భర్త జార్ఖండ్‌కి వెళ్ళినప్పటి నుంచి మాట్లాడడం లేదని కుటుంబ పోషణకు డబ్బులు పంపడం లేదని తన తండ్రి జోగయ్యకు చెప్పు కుంటూ బాధపడేది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన మమత సోమవారం తన ఇంటిలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి టేకు జోగ య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.


ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూన్ 3: అప్పు తీర్చే మార్గం లేక మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన వడకాపురం శ్రీనివాస్(44) చెట్టుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్‌ఐ ఉమాసాగర్ తెలిపి న వివరాల ప్రకారం.. పడకల్ గ్రామానికి చెందిన వడకాపురం శ్రీనివాస్ రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీనివాస్ కోసం వెతుకుతున్నారు. సోమవారం ఓ రైతు తన పొలంలోకి వెళ్లగా అక్కడ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీనివాస్ గతంలో ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసి అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేని బెంగతో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ ఉమాసాగర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భీమారం, జూన్ 3: మండలంలోని గోవిందారం గ్రామంలో గొంటి స్వరూప-స్వామికి చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. సంఘటనా స్థలానికి విద్యుత్ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులు వచ్చి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కరండ్ల మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమప్రభాకర్, వనపర్తి దశరథం, రాగేటి గంగాధర్, పుల్లూరి దేవయ్య కోరుతున్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య



లక్ష్మీ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో మాదాసు లక్ష్మీ (45) అనే వివాహిత అప్పుల బాధతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి మాదాసు లక్ష్మీ-నర్సింలు దంపతులు దినసరి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. సరైన పనులు లభించకపోవడంతో ఐదేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పు చేసి నర్సింలు బహ్రెయిన్ వలస వెళ్లాడు. చాలీచాలని వేతనంతో పనులు చేసినా అప్పులు తీరలేదు. మూడేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన రెండేళ్ల తర్వాత తిరిగి పయనమయ్యాడు. తండ్రి గల్ఫ్ దేశానికి వలస వెళ్లిన అప్పు తీరకపోవడంతో కొడుకు నాని మరో రూ.2 లక్షలు అప్పు చేసి ఏడాది కిందట దుబాయికి వెళ్లాడు. తండ్రి నర్సింలు బహ్రెయిన్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై కదలలేని స్థితికి చేరుకున్నాడు. అక్కడ చికిత్స పొందిన అయన మూడు నెలల కిందట ఇంటికి వచ్చాడు. ఓ వైపు కదలలేని భర్త.. మరో వైపు అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఇంట్లో ఉరేసుకుంది. భర్త నర్సింలు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఐ విధులకు ఆటంకం

● యువకులపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 3: తీగలగుట్టపల్లిలోని అపోలోరీచ్ ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి జరిగిన గొడవకు సంబంధించి ఎస్‌ఐ విధులను ఆటంకపరిచి నందుకు సుభాష్‌నగర్‌కు చెందిన యువకులపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కాంగ్రెస్ నాయకుడిపై ఆదివారం దాడి జరగ్గా అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి సుభాష్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు ఆసుపత్రి వద్దకు వెళ్లగా అక్కడ గొడవ జరగకుండా విధుల్లో ఉన్న ధర్మారం ఎస్‌ఐ సత్యనారాయణ ఇరువర్గాల వారికి సర్దిచెబుతుండగా దురుసుగా ప్రవర్తించారు. ఈ మేరకు తన విధులను ఆటంకపరిచారని ఎస్‌ఐ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

సిరిసిల్ల రూరల్, జూన్ 3: ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన మూడు కేసుల్లో ఒకరికి సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన సోమవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏప్రిల్ 2వ తేదీన నేరెళ్లకు చెందిన మీసాల బాలరాజు తన వాహనాన్ని సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద పార్క్ చేశాడు. ఏప్రిల్ 3వ తేదీన పట్టణంలోని సాయినగర్‌కు చెందిన వీరబత్తిని మహేష్ తన వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్క్ చేశాడు. ఏప్రిల్ 5వ తేదీన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన వాసాల శివకుమార్ తన వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్క్ చేశాడు. ఈ మూడు వాహనాలు చోరీకి గురైనట్లు బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అజం గంజ్‌కు చెందిన మలావత్ తులసీరాంను రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం ఎస్సై శ్రీనివాసరావు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్‌ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ నిందితుడిని ప్రవేశపెట్టారు. నిందితుడు మేజిస్ట్రేట్ ముందు నేరాన్ని అంగీకరించడంతో సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో పెద్దపల్లి ఎమ్మెల్యే పూజలు



పెద్దపల్లి ఎమ్మెల్యేకు చిత్రపటం బహుకరిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి, జూన్ 3: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కుటుంబ సభ్యులు సోమవారం సందర్శించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు ఆశీర్వదించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పెద్దపల్లి ఎమ్మెల్యే దంపతులకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమగ్ర కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భార్గవ రామ్



సమావేశంలో మాట్లాడుతున్న భార్గవరామ్

గొల్లపల్లి, జూన్ 3 : రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన సమగ్ర కులగణన చేపట్టాలని, సమగ్ర కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవ రామ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీలను లెక్కలోకి తీసుకోకపోవడం వల్లనే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టామని, అలాంటి తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా త్వరిత గతిన సమగ్ర కులగణను చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు గంపగుత్తగా 60 శాతం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడం వల్లనే ఈనాడు ఆ పార్టీ అధికారంలోకి వచ్చి సీఎంగా రేవంత్ రెడ్డి గద్దెనెక్కారన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు వెంటనే సమగ్ర కులగణన చేపట్టాలని తద్వారా బీసీకు రాజకీయాల్లో సముచిత స్థానం దక్కేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, కాళ్ల రాజయ్య, కందుకూరి తిరుపతి, మేకల లింగయ్య పాల్గొన్నారు.

ఘనంగా మురళీకృష్ణ ఆలయ వార్షికోత్సవం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి, జూన్ 3: పట్టణంలోని మురళీకృష్ణ ఆలయం 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో స్వామి వారికి పురోహితులు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు, హారతీ, అర్చనలు తదితర కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ ఆలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి దంపతులు చైతన్య స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరించి భక్తులకు అందజేశారు.కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో పుల్లూరి జగదీశ్వర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'నేల తడిసిన తర్వాత పత్తిని విత్తుకోవాలి'

కొడిమ్యాల, జూన్ 3 : నేల పత్తికి అనుకూలంగా తడిసిన తర్వాతనే పత్తి విత్తనాలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి రైతులను కోరారు. సోమవారం ఏవో మాట్లాడుతూ తేలికపాటి వర్షాలకు విత్తనాలను నాటుకుంటే మొలకెత్తక నష్టం జరుగుతుందన్నారు. పూర్తి స్థాయిలో వర్షం కురిసిన తర్వాత నేల పదును చూసుకొని పత్తి విత్తనాలను నాటుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలోని రైతులకు జీలుగ. జనుము పంపిణీ చేశామన్నారు. పంటలు వేసుకునే రైతులు భూసార పరీక్షలను చేయించుకొని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలను పొంది అధిక దిగుబడులను పొందాలన్నారు.

తుప్పు పట్టిన వాహనాలు.. పట్టని అధికారులు



తుప్పు పట్టిన వాహనాలు

మల్యాల, జూన్ 3: మల్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురి అయిన వాహనాలు తుప్పు పడుతున్నాయి. ఏళ్ల తరబడిగా వాహనాలను మూలన పడేయడంతో అవి పూర్తిగా చెడిపోయాయి. పోలీస్‌స్టేషన్ పక్కన, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ద్విచక్రవాహనాలు, కార్లు, జీపులు, ఆటోలు తదితర వాహనాలు తుప్పు పట్టాయి. వాటిని స్క్రాప్‌గా అమ్మితే కొంత మేర ఆదాయం వచ్చే అవకాశం ఉండగా ఆ దశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

ఇల్లంతకుంట, జూన్ 3: ఆదర్శ పాఠశాలలో ప్రవేశం పొందే విద్యార్థులు ఈ నెల 11లోగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ప్రిన్సిపాల్ మధూకర్ ఒక ప్రకటనలో కోరారు. రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాల ఆవరణలో 6వ తరగతిలో ప్రవేశం కోసం జరిగిన పరీక్ష ఫలితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. 6వతరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాల కోసం టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

అద్దె భవనాలు.. వెక్కిరిస్తున్న ఖాళీలు

- భర్తీకి నోచుకోని టీచర్, ఆయా పోస్టులు
- అరకొర వసతులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవస్థలు

కథలాపూర్, జూన్ 3 : చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. దీనికి తోడు టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఏళ్ల తరబడి సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు.

- పోస్టుల భర్తీలో విపరీత నిర్లక్ష్యం

మండలంలో కథలాపూర్, చింతకుంట సెక్టార్లు ఉండగా వీటి పరిధిలో 49 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఊట్‌పల్లి, కథలాపూర్, కలికోట గ్రామాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న క్రమంలో ఇన్‌ఛార్జ్‌లతో కాలం వెళ్లదీస్తున్నారు. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సరుకులు అందించడమే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే ఆయా పోస్టులు 13 ఖాళీగా ఉన్నాయి. కీలకమైన ఈ ఆయా పోస్టుల ఖాళీ వల్ల సకాలంలో పిల్లలకు, బాలింతలు, గర్భిణీలకు మెనూ ప్రకారం అందించే సరుకులు అందని పరిస్థితి నెలకొంది. మండలంలో 296 మంది గర్భిణీలు,



నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం పనులు

269 మంది బాలింతలు, 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 1436, 3 సంవత్సరాల నుంచి 6 ఏళ్ల వయస్సున్న పిల్లలు 7149 మంది ఉన్నారు. వీరికి కోడిగుడ్లు, బాలామృతం వంటి సరుకులు ఇంటికి తీసుకుకెళ్లి పంపిణీ చేస్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కేవలం 8 మాత్రమే సొంత భవనాలు ఉండగా 19 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరికొన్ని కేంద్రాలను స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగిస్తున్నారు. మారుమూల ప్రాంతమైన తుర్తిలో ఆరేళ్ల కిందట మంజూరైన భవనానికి నిధులు లేకపోవడంతో అర్థాంతరంగా పనులు నిలిచిపోయాయి. అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న క్రమంలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యం నెరవేరడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరి స్తుందనే ఆశాభావం వెలిబుచ్చుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం: రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న టీచర్, ఆయా పోస్టుల ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం, పక్కా భవనాలు లేని కేంద్రాలకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం అందించే అనుబంధ ఆహారం అందిస్తున్నాం. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తగు సలహాలు అందిస్తున్నాం.

విత్తనాల కొరత ఏర్పడితే అధికారులదే బాధ్యత

రూరల్ ఎంపీపీ మహేష్

జగిత్యాలరూరల్, జూన్ 3 : విత్తనాల కొరత ఏర్పడితే దానికి పూర్తి బాధ్యత అధికారులే వహించాలని జగిత్యాల రూరల్ ఎంపీపీ మంగళారపు మహేష్ అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మహేష్ అధ్యక్షతన జగిత్యాల రూరల్ మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలసభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీటీసీ భూమారెడ్డి మాట్లాడుతూ గ్రామానికి విత్తనాల బస్తాలు కేవలం పది మాత్రమే పంపించడం వల్ల గ్రామాల్లో విత్తనాల కొరత తీవ్రంగా ఏర్పడుతుందన్నారు. ఎంపీపీ మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ వైర్లను తమ ఇష్టానుసారంగా విద్యుత్ అధికారులు నరికివేస్తున్నారని, కొన్ని చోట్ల అనవసరంగా చెట్లను తీసివేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని చెట్లకు నష్టం జరుగకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందన్నారు. సమస్య ఉత్పన్నమైన దగ్గరనే చెట్లను తీసివేయాలని అవసరంలేని చోట్ల చెట్లను తీసివేయడం వల్ల చెట్లకు నష్టం జరిగి పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఎంపీడీవో రమాదేవి అన్నారు. ఉపాధికూలీల సంఖ్య గతంలో కంటే ఎక్కువగా పెంచామని, గ్రామాల్లో ఇంకా ఉపాధికూలీల సంఖ్యను పెంచేవిధంగా పంచాయితీ అధికారులు, ప్రజాప్ర తినిధులు చొరవచూపాలని ఎంపీడీవో కోరారు. అధికారులు విధిగా మండలసమావేశాలకు హాజరుకావాలని, ప్రాధాన్యత కలిగిన సమావేశాలకు అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని ఎంపీడీవో రమాదేవి హెచ్చరించారు. సభలో 20



మాట్లాడుతున్న ఎంపీపీ మహేష్

అంశాలపై చర్చ జరుగగా సభ్యులు లేవనెత్తిన సమస్యలకు అధికారులు సానుకూలంగా సమస్యలను నివృత్తి చేశారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో అరవింద, ఎంఈవో గాయత్రి, ఏఇ సుందర్, ఏపీఎం గంగాధర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జానకి, లావణ్య, పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఇ మల్లయ్య, ఎంపీఓ రవిబాబు, కార్యాలయ సూపరిండెంట్ గంగాధర్, మండలసభ్యులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్3: మధ్యాహ్న భోజనం కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, కో కన్వీనర్ నడిగొట్టు లక్ష్మీ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అప్పులు చేసి నాణ్యమైన భోజనాన్ని తయారు చేసి అందిస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రభుత్వమే నిత్యావసర సరుకులతోపాటు గ్యాస్, వంట సామగ్రి అందజేయాలని, కోడిగుడ్ల ధరలను పెంచాలని అన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు జీవో నంబరు 8- 2023 వెంటనే అమలు చేయాలని, బకాయి వేతనాలను చెల్లించడంతోపాటు కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు సీహెచ్‌లత, మణెమ్మ, లావణ్య, కనకలక్ష్మీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మాదాసు శంకరయ్య, మిర్యాల్‌కార్ పద్మ కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు లక్ష్మీనారాయణ, కిషన్, నర్సింలు, శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

వెల్గటూర్, జూన్ 3: చిన్న తనంలో తమతో ఆడుతూ పాడుతూ కలిసి చదువుకున్న మిత్రుడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా చిన్ననాటి స్నేహితుని కుటుంబానికి అండగా ఉంటామని ఆర్థిక సాయం చేసి చేయూ తనిచ్చారు. వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన స్నేహితులు కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు మూగల రవి మృతి చెందిన విషయం తెలిసి దీర్ఘ కాలిక ప్రయో జనాలను దృష్టిలో పెట్టుకొని అతని ఇద్దరు ఆడ పిల్లల పేరున పోస్ట్ ఆఫీసులో ఒకొక్కరికి రూ.30 వేల చొప్పున డిపాజిట్ చేసి బాండులను ఆ కుటుంబానికి అందజేశారు. భవిష్యత్తులో పిల్లల చదువులకు అండగా ఉంటామని భరోసానిచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నీలం సంపత్, సతీష్, లక్ష్మణ్, తిరుపతి, అశోక్, వెంకటేష్, శ్రీకాంత్, అఫ్సర్, మల్లిక, పుష్పలత, నారాయణ, ప్రేంసాగర్ పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

గ్రీవెన్స్‌డేతో సత్వర న్యాయం

సిరిసిల్ల రూరల్, జూన్ 3: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్‌డే ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 22 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరి ష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రజలకు సమర్థ వంతంగా సేవలు అందిస్తున్నామని అన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహి స్తున్నామని, అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంబిస్తున్నామని తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తున్నట్లు చె ప్పారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రాయికల్, జూన్ 3: సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాయికల్ మండల పరిషత్ అధ్యక్షురాలు లావుడ్య సంధ్యారాణి సురేందర్ నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంధ్యారాణి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి కేవలం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, మైతాపూర్ ఎంపీటీసీ రాజనాల మధుకర్, కుమ్మరిపెల్లి ఎంపీటీసీ నాగరా జు, బోర్నపెల్లి ఎంపీటీసీ మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, వ్యవసాయ అంశాలపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సకాలంలో విత్తనాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం ద్వారా మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని, పనులు ప్రారంభ దశలో ఉన్నాయని మండల విద్యాధికారి గంగాధర్ తెలిపారు. మండల పరిధిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల పట్ల ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులను మండల వైద్యాధికారులు కోరారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్షురాలు సంధ్యారాణి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బం దులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సం బంధిత అధికారులకు సూచించారు. గత ఐదేళ్లుగా అధికారుల అండతో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో మండల పరిషత్ ఎంపీటీసీ, సర్పంచుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో సుష్మా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి

కోరుట్ల, జూన్ 3 : మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి రాములుకు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘన నివాళిని అర్పించారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో కొమిరెడ్డి రాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏలేటీ మహిపాల్ రెడ్డి, కొంతం రాజం, వెగ్యారపు మురళి, కటకం చంద్రశేఖర్, కడకుంట్ల గంగాధర్, జాకి, రియాజ్, సోగ్రబీ, అనంద్ గౌడ్, పెరుమాండ్ల సత్యానారయణ, తేలు రాజ కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెట్‌పల్లి : మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని కొమిరెడ్డి రాములు పార్టీ ఆఫీస్‌లో ఆయన చిత్రపటానికి జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాములు చిత్రపటానికి పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల నియోజక వర్గంలోని ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, కౌన్సిలర్ యామ రాజయ్య, ఎర్రోళ్ల హన్మండ్లు, జెట్టి లక్ష్మణ్, సురభి అశోక్, ప్రసాద్, రైస్, పెంట ప్రణయ్, పరందాం, రాజు, గంగాధర్, హరీష్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని కొమిరెడ్డి రాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండలో బడిబాట

కథలాపూర్, జూన్ 3 : మండలంలోని సిరికొండలో సోమవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సర్కారు బడుల్లో ఉచిత విద్యాబో ధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వసతులు కల్పిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. నూతనంగా ఈ విద్యా సంవత్సరంకుగాను విద్యార్థులను అడ్మిషన్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్, నోడల్ అధికారి లోకిని శ్రీనివాస్, హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

7 లోపు ప్రవేశాలు పొందాలి

కథలాపూర్, జూన్ 3 : మోడల్ స్కూల్‌లో 6వ తర గతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఈ నెల 7 లోపు అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశ పరీక్ష ర్యాంకులను నోటీస్ బోర్డుపై అతికించామని పేర్కొన్నారు.

నిర్ణీత ధ్రువపత్రాలతో 2024-25 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్ తీసుకోవాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

మల్యాల, జూన్ 3: మండలంలోని తాటిపల్లిలో కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూడ ఓదెలు, ప్రధా కార్యదర్శిగా ఏనుగుల రాజు, ఉపాధ్యక్షునిగా తొంట రాజయ్య, సంయుక్త కార్యదర్శిగా మల్లేశం కోశాధికారిగా కోరె వెంకటేష్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు సంఘ నాయకుడు బైరి బీరయ్య తెలిపాడు.

ఘనంగా జాతీయ సైకిల్ దినోత్సవం

మల్లాపూర్, జూన్, 3 : మండలంలోని ఓబులపూర్ గ్రామంలో ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ ఫౌండర్ వాల్గొట్ కిషన్ ఆధ్వర్యంలో జాతీయ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద సైకిల్ తొక్కడం వలన కలిగే ఆరోగ్య ఫలితాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సైకిల్ తొక్కడం వలన ఆరోగ్య సమస్యలు బీపీ, షుగర్, ఉబకాయం వంటి వ్యాధులు రావని, రోజంతా చుకుగా ఉంటారన్నారు. రోజు రోజు తరిగిపోతున్న పెట్రోలు నిల్వలను కాపాడుకోవచ్చని, పెట్రోలు ఖర్చులు ఉండవని, వాతావరణ కాలుష్యం ఉండదని, ఎలాంటి ఫైన్‌ల కట్టే అవసర ముండదన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ కన్వీనర్ శ్రీరాముల వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో ఒకినావా విద్యార్థుల ప్రతిభ



బెల్ట్‌లను పదర్శిస్తున్న విద్యార్థులు

కోరుట్ల, జూన్ 3 : కరీంనగర్ పట్టణంలో జరిగిన కరాటే బెల్ట్ పోటీలలో కోరుట్ల ఒకినావా విద్యార్థులు ప్రతిభ కనపరిచి బెల్ట్‌లు సాధించినట్లు ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కోచ్ అల్లె రమేష్ సోమవారం తెలిపారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో కటాస్ కుమితే బుంకాయిలోని వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో మర్రిపల్లి బాని, బోడనందిని, కటకం హేమంత్, అంకం సంతోష్, అందెరి రణధీర్, అది ప్రభాస్ ప్రతిభ కనపరిచి బ్లాక్ బెల్ట్ సాధించినట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో పాటు ఇన్‌స్ట్రక్టర్ అల్లే రమేష్‌ను కరాటే తెలంగాణ చీఫ్ వసంత్ కుమార్ బెల్ట్‌లను అందించి అభినందించారు.

ఎంపీగా విజయం సాధించాలని పూజలు

మల్యాల, జూన్ 3: ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మంగళవారం వెలువడనున్న ఫలితాలలో విజయం సాధించాలని అభ్యర్థి కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుగుణ తనయుడు సాయుధ, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి సోయం విక్రం కాంగ్రెస్ నాయకులు రాంలింగారెడ్డి, ముత్యం శంకర్, సంత ప్రకాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులు

కోరుట్ల, జూన్ 3 : పట్టణంలోని లిటిల్, గౌతమ్ స్కూల్ విద్యార్థులు కరీంనగర్‌లోని పారమిత పాఠశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్ని శిక్షణను పొందారు. ఎన్‌సీసీ క్యాంపులో విద్యార్థులు మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, యోగ, పెరేడ్, ఫిజికల్ ట్రైనింగ్ అనే అంశాలపై శిక్షణ పొంది సర్టిఫికెట్లను సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్‌లు బండి మహదేవ్, ఎంఎ గఫార్ తెలిపారు. ట్రైనింగ్ ముగించుకోని వచ్చిన విద్యార్థులను పాఠశాల నిర్వహకులు సన్మానించి అభినందించారు.

పనులను పరిశీలించిన జడ్పీ సీఈవో

ముస్తాబాద్, జూన్ 3: మండలంలోని గూడూరు ప్రగతి భవన్‌లో కొన సాగుతున్న పనులను జడ్పీ సీఈవో ఉమారాణి సోమవారం పరిశీలించారు. రూ.లక్ష జడ్పీ నిధులతో ప్రగతి భవన్ ఆవరణలో బోరు మోటారును ఏర్పాటును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.